క్లుప్తంగా

ఆందోళన వద్దు.. అప్రమత్తంగా ఉండాలి



వాల్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న అగ్నిమాపక అధికారులు, సిబ్బంది

మహేశ్వరం: అగ్ని ప్రమాదం జరిగినప్పుడు ఆందోళన చెందకుండా, అప్రమత్తంగా ఉండాలని అగ్నిమాపక అధికారి నాగార్జున సూచించారు. అగ్నిమాపక వారోత్సవాల సందర్భంగా గురువారం మండల కేంద్రం లోని రూమా ఇండెన్ గ్యాస్ ఏజెన్సీ కార్యాలయం, గోదాం వద్ద అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అగ్ని ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వేసవిలో అగ్ని ప్రమాదాలు ఎక్కువగా జరిగే అవకాశాలున్నాయని, వాటిని నివారణకు ముందస్తు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ప్రమాదం జరిగిన వెంటనే ఫైర్ స్టేషన్ టోల్ ఫ్రీ నంబర్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో మహేశ్వరం రూమా ఇండెన్ గ్యాస్ ఏజెన్సీ మేనేజర్ రఘుపతి, అగ్నిమాపక అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సర్దార్‌నగర్‌లో బిహార్ సర్పంచ్‌ల బృందం



గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట బిహార్ సర్పంచ్‌ల బృందం సభ్యులు

షాబాద్: మండలంలోని సర్దార్‌నగర్ గ్రామాన్ని బిహార్ సర్పంచ్‌ల బృందం, ఎన్‌ఐఆర్‌డీ అధికారులు విద్యుల్లత, సైదిరెడ్డిలు గురువారం సందర్శించారు. గ్రామంలో ఎన్ఆర్ఈజీఎస్ పథకం కింద చేపట్టిన పల్లె ప్రకృతివనం, వైకుంఠధామం, వన మహోత్సవం నర్సరీ, కంపోస్టుయార్డు తదితర వాటిని పరిశీలించారు. ఎన్ఆర్ఈజీఎస్ పథకం కింద వచ్చిన నిధులతో చేపట్టిన పనుల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం పల్లె ప్రగతి కార్యక్రమంతో గ్రామాలను ఆదర్శంగా తీర్చిదిద్దడం ఎంతో బాగుందని వారు తెలిపారు. తడి, పొడి చెత్తను వేరు చేసి కంపోస్టుయార్డుకు తరలించి గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచుతున్నట్లు పంచాయతీ సిబ్బంది వివరించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నర్సింహులు, పంచాయతీ కార్యదర్శి విజయసింహ, పంచాయతీ సిబ్బంది, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

సన్నాలు సగంసగం

- పూర్తి స్థాయిలో రేషన్ దుకాణాలకు చేరని సన్నబియ్యం
- క్యూ కడుతున్న లబ్ధిదారులు
- డీలర్లపై పెరుగుతున్న ఒత్తిడి
- సమాధానం చెప్పలేక.. షాపుల మూసివేత



సరూర్‌నగర్‌లో రేషన్ బియ్యం కోసం క్యూలో నిల్చున్న లబ్ధిదారులు

హుడాకాంప్లెక్స్: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సన్నబియ్యం పంపిణీ అస్తవ్యస్తంగా మారింది. లబ్ధిదారులకు పంపిణీ చేసే బియ్యం.. ప్రతి నెలా 1వ తేదీ లోగా ఆయా రేషన్ దుకాణాలకు చేరుకోవాల్సి ఉంటుంది. కానీ మెజార్టీ షాపులకు సగం కూడా రావడం లేదని తెలుస్తోంది. తొలి రోజు వచ్చిన బియ్యం వచ్చినట్లే పంపిణీ కాగా.. ఆ తర్వాత రోజు నుంచి స్టాక్ లేకపోవడంతో మిగతా లబ్ధిదారులు, డీలర్లు ఇబ్బంది పడుతున్నారు.

అరకొర సరఫరా

సరూర్‌నగర్ డివిజన్ పరిధిలో ఏడు నిత్యావసరా సరుకుల పంపిణీ దుకాణాలు ఉండగా.. ఒక్కో షాపు పరిధిలో 900 వరకు రేషన్ కార్డులు ఉన్నాయి. పేద, మధ్య తరగతి కుటుంబాలకు చెందిన వీరంతా రేషన్ బియ్యం కోసం పనులు మానుకుని అక్కడే పడిగాపులు కాయాల్సి వస్తోంది. లబ్ధిదారుల నిష్పత్తి మేరకు బియ్యాన్ని సరఫరా చేయకపోవడంతో, బియ్యం కోసం వచ్చిన లబ్ధిదారులకు సమాధానం చెప్పలేక డీలర్లు తల పట్టుకోవాల్సి వస్తోంది. ఈ ఒత్తిడి తట్టుకోలేక కొందరు డీలర్లు దుకాణాలను మూసివేసి వెళ్తుండగా.. మరికొందరు త్వరగా మూసేస్తున్నారు.



అంబేడ్కర్‌నగర్‌లోని రేషన్‌షాపు ఎదుట లబ్ధిదారుల పడిగాపులు

నాడు ముఖం చా టేసి..

ఏప్రిల్ 1 నుంచి రేషన్ లబ్ధిదారులకు ప్రభుత్వం సన్న బియ్యం పంపిణీకి శ్రీకారం చుట్టింది. మంత్రులు, ఎమ్మెల్యే ఈ పథకాన్ని ఆర్భాటంగా ప్రారంభించారు. లబ్ధిదారులు ఇళ్లకు వెళ్లి భోజనాలు చేశారు. బహిరంగ మార్కెట్లో ఈ బియ్యం కిలో రూ.45 నుంచి 60 వరకు పలుకుతుండటంతో నిన్న మొన్నటి వరకు రేషన్ బియ్యం తీసుకెళ్లేందుకు వెనకాడిన కార్డు దారులు కొందరు.. ప్రస్తుతం రేషన్ దుకాణాలకు క్యూ కడుతున్నారు.

మలి విడత సరఫరాలో నూక

ప్రభుత్వం చౌకధరల దుకాణాలకు విడతల వారీగా బియ్యం సరఫరా చేస్తున్న సంగతి తెలిసిందే. అయితే తొలి విడతలతో మేలురకం బియ్యం సరఫరా అయిందని పలువురు లబ్ధిదారులు పేర్కొంటున్నారు. దీంతో బియ్యం తీసుకునేందుకు పోటీ పడటంతో ఒకటి రెండు రోజుల్లోనే స్టాక్ అయిపోయింది. ఆ తర్వాత విడతలతో సరఫరా చేసిన బియ్యంలో నూక ఎక్కువగా వచ్చిందని ఆరోపిస్తూ.. వాటిని తీసుకునేందుకు వెనుకాడుతున్నారు. ఈ నేపథ్యంలో లబ్ధిదారులు తొలుత డీలర్లపై అనుమానం వ్యక్తం చేశారు. ఆ తరువాత వాస్తవాలను గమనించి, నాసిరకం బియ్యాన్ని సరఫరా చేస్తున్న మిల్లర్లను గుర్తించి, వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ఇదిలా ఉండగా.. గతంలో ఎన్నడూ బియ్యం తీసుకునేందుకు రాని వారు కూడా.. సన్నబియ్యం సరఫరాతో లబ్ధిదారులందరూ దుకాణాలకు క్యూ కడుతున్నారని పలువురు పేర్కొనడం గమనార్హం.

“ నూకలు ఉన్నాయి

ప్రభుత్వం సరఫరా చేస్తున్న సన్న బియ్యంలో నూక ఎక్కువగా ఉంది. కొంత మందికి మేలు రకం బియ్యం అందాయి. మాకు మాత్రం నూక ఎక్కువగా వచ్చింది. గతంలో దొడ్డు బియ్యాన్ని ఇడ్లీకి వాడేవాళ్లం. ఇప్పుడు బువ్వ వండుకుని తింటున్నాం.

– రామేశ్వరి, సరూర్‌నగర్

పోషకాహారాన్ని వినియోగించుకోండి

సీడీపీఓ శాంతిశ్రీ



మాట్లాడుతున్న సీడీపీఓ శాంతిశ్రీ తదితరులు

కందుకూరు: అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు, గర్భిణులకు ప్రభుత్వం అందించే పోషక ఆహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని సీడీపీఓ శాంతిశ్రీ అన్నారు. మండలంలోని గూడూరు పంచాయతీ పరిధి బండమీద గూడూరులో అమెజాన్ సంస్థ ఆధ్వర్యంలో పునర్నిర్మాణం చేసిన అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆ సంస్థ ప్రతినిధులతో కలిసి సీడీపీఓ గురువారం ప్రారంభించారు. అనంతరం పోషణ పక్షోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పోషకాహారం చిన్నారుల ఎదుగుదలకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. చిరుధాన్యాలతో కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. వాటితో ఏఏ వంటలు చేయాలో వివరించారు. ఈ సందర్భంగా సీఎస్ఆర్ నిధులతో సమాజానికి ఉపయోగపడే పనులను చేస్తున్న అమెజాన్ ప్రతినిధులను గ్రామస్తులు అభినందించారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు అవినాష్, చైతన్య, ఇదాయత్, జెషి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు ఇందిర, సబిత, అంగన్‌వాడీ టీచర్లు నిర్మల, రాధిక, విజయ, కల్పన, ప్రసన్న, కవిత తదితరులు పాల్గొన్నారు.

పశువులకు గాలికుంటు టీకాలు



మొయినాబాద్: సురంగల్‌లో పశువులకు టీకాలు వేస్తున్న పశువైద్యులు



శంకర్‌పల్లి: ఇరుకుంట తండాలో టీకాలు వేస్తున్న డాక్టర్ శ్రావణి

మొయినాబాద్: పాడి పశువులకు గాలికుంటు నివారణ టీకాలు తప్పనిసరిగా వేయించాలని మండల పశువైద్యాధికారి అహ్మద్ అన్నారు. మున్సిపాలిటీలోని సురంగల్‌లో గురువారం గాలికుంటు నివారణ టీకాలు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామంలోని 192 పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. టీకాలు కార్యక్రమంలో గ్రామాల వారీగా గురువారం నుంచి మే 15వ తేదీ వరకు కొనసాగుతుందన్నారు. మొయినాబాద్ మున్సిపాలిటీ, మండల పరిధిలోని పాడిరైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది ప్రసన్నకుమార్, భీంరావ్, గోరేమియా తదితరులు పాల్గొన్నారు.

నెల రోజుల పాటు..

శంకర్‌పల్లి: మండలంలో నెల రోజుల పాటు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేస్తున్నట్లు శంకర్‌పల్లి పశు వైద్యాధికారి మానసరెడ్డి, మహారాజ్‌పేట్ పశు వైద్యాధికారి శ్రావణి తెలిపారు. గురువారం మండలంలోని చిన్న శంకర్‌పల్లి, ఇరుకుంట తండాలో వ్యాధి నివారణ టీకాలు ప్రారంభించారు. పశు వైద్యాధికారులు మాట్లాడుతూ.. వచ్చే నెల 14వరకు మండలంలో ఈ కార్యక్రమం నిరంతరాయంగా కొనసాగుతుందని చెప్పారు. ఇందుకు 4 బృందాలు ఏర్పాటు చేసుకున్నట్లు స్పష్టం చేశారు.

గర్భకోశ వ్యాధులకు చెక్

షాబాద్: పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు తప్పని సరిగా వేయించాలని రేగడిదోస్వాడ, షాబాద్ పశువైద్యాధికారులు డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి, డాక్టర్ స్రవంతి పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని మాచన్‌పల్లి, కుమ్మరిగూడ, రేగడిదోస్వాడ గ్రామాలల్లో పశువులకు గాలి టీకాలు వేశారు. గర్భకోశ వ్యాధులు రాకుండా ఉండాలంటే టీకాలు తప్పకుండా వేయించాలన్నారు.

'మాకు న్యాయం చేయండి'



ఆందోళన చేస్తున్న మామిడిపల్లి రైతులు

పహాడీషరీఫ్: శంషాబాద్ విమానాశ్రయం కోసం 444 ఎకరాల భూములిచ్చిన తమకు న్యాయం చేయాలని బాలపూర్ మండల పరిధి మామిడిపల్లి గ్రామ రైతులు డిమాండ్ చేశారు. విమానాశ్రయం నిర్మాణం కోసం తమ భూములు తీసుకొని, ఎలాంటి పరిహారం చెల్లించలేదని వాపోయారు. తమ నుంచి సేకరించిన భూములను ఎందుకూ వినియోగించకుండా, ఇప్పుడు అమ్మేందుకు ప్రభుత్వం యత్నిస్తుందని ఆరోపించారు. బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ మాజీ కార్పొరేటర్లు యాతం పవన్ కుమార్ యాదవ్, సుక్క శివకుమార్‌లతో కలిసి బాధిత రైతులు ఆ భూముల్లో గురువారం ఆందోళన వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మామిడిపల్లి సర్వే నంబర్ 99/1లో 186 మంది రైతుల నుంచి 444 ఎకరాల భూమిని సేకరించారని తెలిపారు. 60 ఏళ్ల నుంచి తాము ఆ భూముల్లో పొజిషన్‌లో ఉంటూ, భూమి శిస్తు చెల్లించామని పేర్కొన్నారు. ఎయిర్‌పోర్టుకని భూములు సేకరించి, అప్పట్లో ఏపీఐఐసీకి కేటాయించారని వెల్లడించారు. గతంలో ఉన్న కోర్టు కేసులు క్లియర్ కావడంతో.. రాష్ట్ర ప్రభుత్వం ఆ భూములను విక్రయించేందుకు యత్నిస్తుందన్నారు. పోరాటంలో భాగంగా గత ప్రభుత్వం బాధితుల జాబితాను గుర్తించడాన్ని దృష్టిలో ఉంచుకొని, బాధితుల కుటుంబీకుల్లో ఒకరికి ఉద్యోగం, 500 గజాల స్థలం ఇవ్వాలని కోరారు. లేని పక్షంలో మార్కెట్ ధరకు అనుగుణంగా నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.

స్వయం ఉపాధిపై దృష్టి సారించాలి

ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

కడ్తాల్: యువత స్వయం ఉపాధి రంగాలపై దృష్టి సారించాలని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలో మూనావత్ రాజునాయక్ ఏర్పాటు చేసిన ఆటోఫైనాన్స్ కార్యాలయాన్ని స్థానిక నాయకులతో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, యువత స్వయం ఉపాధి పొందేందుకు ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తుందన్నారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, సింగిల్‌విండో డైరెక్టర్ వెంకటేశ్, నాయకులు లక్పతి నాయక్, బీక్యానాయక్, రామునాయక్, యాదగిరిరెడ్డి, రాజునాయక్, రామకృష్ణ ఉన్నారు.

చేవెళ్లలో భారీ వర్షం

చేవెళ్ల: స్థానికంగా భారీ వర్షం కురిసింది. గురువారం సాయంత్రం 4 గంటల సమయంలో ఈదురుగాలులతో కూడిన వాన కురవడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. చేవెళ్ల మున్సిపాలిటీతోపాటు పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు, దుకాణాదారులు, చిరువ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

ఆయిల్ పామ్ సాగుతో లాభాలు

డివిజన్ హార్టికల్చర్ అధికారి హిమబిందు

షాద్‌నగర్: ఆయిల్ పామ్ సాగుతో రైతులు అధిక లాభాలను పొందవచ్చని డివిజన్ హార్టికల్చర్ అధికారి హిమబిందు పేర్కొన్నారు. గురువారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని కిషన్‌నగర్‌లో ఉద్యానవన, పట్టుపరిశ్రమ శాఖ ఆధ్వర్యంలో రైతులకు ఆయిల్‌పామ్ సాగుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... మండల పరిధిలో దాదాపు 252 ఎకరాల విస్తీర్ణంలో ఆయిల్‌పామ్ సాగు అవుతుందన్నారు. దీని నిర్వాహణకు డబ్బులు నేరుగా రైతుల ఖాతాలో జమ అవుతాయని చెప్పారు. ఆయిల్‌పామ్ పంట సాగు చేసిన రైతులకు 90శాతం సబ్సిడీపై డ్రిప్ అందజేస్తారన్నారు. ఎరువులకు ఎకరానికి రూ.4200 చొప్పున నాలుగేళ్లకు రూ.16800లను ప్రభుత్వం రైతులకు చెల్లిస్తుందన్నారు. ఎకరాలకు 8 నుంచి 10 టన్నులపైనే గెలల దిగుబడి వస్తుందని, ఒక టన్ను రూ.21వేలు ఉంటుందన్నారు. ఆయిల్‌పామ్ పంటను మార్కెట్‌కు తీసుకువెళ్లేందుకు ఎలాంటి ఇబ్బందులు లేవని, కంపెనీవారే పొలం దగ్గరకు వచ్చి కొనుగోలు చేస్తారని అన్నారు. కార్యక్రమంలో ఆయిల్ వాల్యూ కంపెనీ వైస్ ప్రెసిడెంట్ రామ్మోహన్‌రావు, ఏరియా మేనేజర్ ప్రమోద్‌కుమార్, ఫీల్డ్ ఆఫీసర్ మల్లారెడ్డి, వివిధ గ్రామాల రైతులు తదితరులు పాల్గొన్నారు.

మత విద్వేషాలకు బీజేపీ కుట్ర

- ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్న కేంద్రం
- రాజ్యాంగ పరిరక్షణకు కలిసి రావాలి
- పీసీసీ సభ్యుడు భాస్కర్‌రెడ్డి, నాయకులు



మహేశ్వరం: పోరండ్లలో సంవిధాన్ కార్యక్రమంలో మాట్లాడుతున్న భాస్కర్‌రెడ్డి



కందుకూరు: ముచ్చర్లలో ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

మహేశ్వరం: దేశంలో మత విద్వేషాలకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కుట్ర చేస్తుందని పీసీసీ సభ్యుడు దేప భాస్కర్‌రెడ్డి ఆరోపించారు. గురువారం మండల పరిధి కొళ్లపడకల్, పోరండ్ల గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జైబాపు, జైభీమ్, జై సంవిధాన్ కార్యక్రమంలో భాగంగా పార్టీ శ్రేణులతో ఆయన పర్యటించారు. రాజ్యాంగ పరిరక్షణ, గాంధీ, అంబేడ్కర్ సిద్ధాంతాలను ప్రజలకు వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అధికారంలోకి వచ్చిన 11 సంవత్సరాలలో బీజేపీ ప్రభుత్వం.. దళితులు, మైనార్టీలు, బీసీలపై దాడులకు పాల్పడుతూ.. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తుందని విమర్శించారు. రాజ్యాంగాన్ని కించపరిచేలా బీజేపీ, ఆర్ఎస్ఎస్‌లు వ్యవహరిస్తున్నాయన్నారు. రాజ్యాంగానికి సవరణలు చేస్తూ, కేంద్రం తనకు అనుకూలంగా మార్చుకుంటుందని పేర్కొన్నారు. రాజ్యాంగ విలువలు, ప్రజాస్వామ్యాన్ని కాపాడే బాధ్యత కాంగ్రెస్ పార్టీ తీసుకుంటుందని, రాజ్యాంగ పరిరక్షణకు ప్రజలు కలిసి రావాలని పిలుపునిచ్చారు. అంతకు ముందు సంవిధాన్‌పై కర పత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ రాష్ట్ర ఎస్సీసెల్ కన్వీనర్ నందిగామ నర్సింహ, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చాకలి యాదయ్య, పార్టీ మండల మాజీ అధ్యక్షుడు ఈశ్వర్ ముదిరాజ్, ఆవుల యాదయ్య, శివగంగ ఆలయ కమిటీ చైర్మన్ అల్లె కుమార్, ఎస్టీసెల్ మండల మాజీ అధ్యక్షుడు నేనావత్ రాజు నాయక్, ఐఎన్‌టీయూసీ నియోజకవర్గ అధ్యక్షుడు నడికూడ శివ, కొళ్లపడకల్ మాజీ సర్పంచ్ యాదయ్య, నాయకులు పాండు నాయక్, బాలరాజ్, అదిల్, పాండు ముదిరాజ్, రాజు, ప్రవీణ్, కొమురయ్య, మల్లేశ్, లాజర్, గణేశ్, శ్రీశైలం పలువురు పాల్గొన్నారు

కందుకూరులో..

కందుకూరు: దేశంలో మత విద్వేషాలకు బీజేపీ ప్రభుత్వం కుట్ర చేస్తుందని మార్కెట్ కమిటీ చైర్మన్ ఎస్.కృష్ణనాయక్, జెడ్పీ మాజీ ఫ్లోర్ లీడర్ ఏనుగు జంగారెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు బొక్క జంగారెడ్డి విమర్శించారు. మండల పరిధి ముచ్చర్ల, ఊట్లపల్లి, వావిళ్లకుంటతండా, బేగరికంచె గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. స్వాతంత్ర్య పోరాటంలో హింస లేకుండా విజయం సాధించామని, ఇప్పుడు మోదీ ప్రభుత్వం.. రాజ్యాంగాన్ని అవహేళన చేస్తూ, ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తుందని ఆరోపించారు. దేశ ప్రజల హక్కులను హరించే కుట్రలో భాగమే అంబేడ్కర్‌ను అవమానించడమని పేర్కొన్నారు. దేశంలోని ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలంటే అది కాంగ్రెస్‌తోనే సాధ్యమన్నారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎస్.వెంకటేశ్‌గౌడ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు ఏ.సురేందర్, ప్రశాంత్, యుగంధర్‌గౌడ్, సీనియర్ నాయకులు ఎండీ సులేమాన్, అఫ్జల్‌బేగ్, అజీజ్, ఎస్.పాండు, ఎస్.జగన్, బి.పాండురంగారెడ్డి, యాదయ్య, నర్సింహ, రూప్లానాయక్ తదితరులు పాల్గొన్నారు.

బడంగ్‌పేట్‌లో..

బడంగ్‌పేట్: కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగాన్ని అపహాస్యం చేస్తుందని, దేశంలో మత విద్వేశాలు రెచ్చగొట్టేందుకు కుట్ర చేస్తుందని కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. కార్పొరేషన్ పరిధి అల్మాస్‌గూడ 24, 25 డివిజన్లలో జైబాపు, జైభీమ్, జై సంవిధాన్ కార్యక్రమాన్ని కాంగ్రెస్ పార్టీ కార్పొరేషన్ అధ్యక్షుడు, గడ్డిఅన్నారం మార్కెట్‌కమిటీ సభ్యుడు గోవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమానికి పీసీసీ కార్యదర్శి అమరేందర్‌రెడ్డి, పీసీసీ ప్రధాన కార్యదర్శి, మాజీ మేయర్ చిగురింత పారిజాత హాజరయ్యారు. గాంధీ, అంబేడ్కర్ చిత్రపటాలను చేతబూని ఇంటింటికీ తిరుగుతూ కరపత్రాలు పంపిణీ చేశారు. రాజ్యాంగంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పార్టీ డివిజన్ అధ్యక్షుడు మల్లారెడ్డి, రవికాంత్‌రెడ్డి, జెళ్ల రమేష్‌గౌడ్, శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



బడంగ్‌పేట్: ఇంటింటి ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు



తుక్కుగూడ: ఇమూమ్‌గూడలో..

కాంగ్రెస్‌తోనే ప్రజా సంక్షేమం

తుక్కుగూడ: కాంగ్రెస్ పార్టీతోనే ప్రజా సంక్షేమం సాధ్యమని ఆ పార్టీ సీనియర్ నాయకుడు బంటు ధనంజయ్ అన్నారు. గురువారం పుర పరిధి ఇమూమ్‌గూడలో జైబాపు, జైభీమ్, జై సంవిధాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. దేశంలో బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగాన్ని అపహాస్యం చేస్తోందని ఆరోపించారు. దానిని పరిరక్షించుకునేందుకు ప్రజలందరూ కలిసి రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు కోటగళ్ల రాజ్‌కుమార్, కప్పల రాజు, స్వామి, కొప్పుల శ్రీను, బండ శ్రీను, సురేందర్‌రెడ్డి, శేషాద్రి, గిరి తదితరులు పాల్గొన్నారు.

SHRIRAM Finance **శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్**

సమోదిత కార్యాలయం: శ్రీటవర్స్, ప్లాట్ నెం.14ఎ, సౌత్‌ఫేజ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండి, చెన్నై-600032.
కార్యాలయ చిరునామా: డి.నెం.20-1-10, 2వ అంతస్తు, సూపర్ బజార్ కాంప్లెక్స్, మెయిన్ రోడ్డు, కాకినాడ-533001.

డిమాండ్ నోటీస్

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002లోని సెక్షన్ 13(2) క్రింద డిమాండ్ నోటీసు

మేము మెస్సర్స్ శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ (గతంలో "శ్రీరామ్ సిటీ యూనియన్ ఫైనాన్స్ లిమిటెడ్" గా పిలవబడేది). NCLT, చెన్నై, తేది.09.11.2022 సి.పి.నెం.69-76 ఆఫ్ 2022 యొక్క ఉత్తర్వుల ప్రకారం శ్రీరామ్ సిటీ యూనియన్ ఫైనాన్స్ లిమిటెడ్, శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్‌లో విలీనమైనది మరియు శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్ గా మార్చబడినది) మరియు తర్వాత (30.11.2022 తేదినాటి కార్పొరేట్ ఫైనాన్స్ మంత్రిత్వ శాఖ లేఖ) ద్వారా శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్‌గా తిరిగి పేరు పెట్టుటకు ఆమోదం పొందిన మేము కంపెనీల చట్టం క్రింద రిజిస్టర్ కంపెనీ అయి ఉన్నామని మీకు తెలియజేయడమైనది. నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ బిజినెస్ నడుపుటకు ఆర్‌బిఐ వద్ద రిజిస్టరై ఉన్నాము. రిజిస్టర్ ఆఫీసు: శ్రీ టవర్స్, ప్లాట్ నెం.14ఎ, సౌత్ ఫేజ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండి, చెన్నై-600032 వద్ద మరియు మా బ్రాంచ్ కార్యాలయం: రాజోలు, డి.నెం.2-51, 1వ ఫ్లోర్, న్యూ ఎల్ఐసి బిల్డింగ్ దగ్గర, మెయిన్‌రోడ్డు, రాజోలు-533252, డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా కలిగియున్న మేము ఈ నోటీసు జారీచేస్తున్నాము.

దిగువ తెలిపిన ఋణగ్రహీతలు / సహ-ఋణగ్రహీతలు / హామీదారులు శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ నుండి ఋణ సహాయాన్ని వినియోగించుకున్నారు. ఋణ సహాయాన్ని వినియోగించుకున్నప్పటికీ, ఋణగ్రహీతలు / హామీదారులు గడువు తేదీల ప్రకారం తేదీల ప్రకారం వడ్డీ మరియు అసలు మొత్తాల తిరిగి చెల్లింపులో పలుమార్లు విఫలమైనారని మేము తెలియజేస్తున్నాము. సదరు ఖాతా నిరర్థక ఆస్తిగా వర్గీకరించబడినవి, దాని వలన శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ యొక్క అధీకృత అధికారి సెక్యూరిటైజేషన్ అండ్ రీ కన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002 క్రింద మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్ రూల్స్, 2002లోని రూల్ 3తో చదువబడే సెక్షన్ 13(2) క్రింద సంక్రమించిన అధికారములను వినియోగించుకొని SARFAESI చట్టం, 2002లోని సెక్షన్ 13(2) క్రింద దిగువ తెలిపిన సంబంధిత తేదీల నాడు డిమాండ్ నోటీసులు జారీ చేసి, నోటీసులు అందిన తేదీ నుండి 60 రోజులలోగా నోటీసులలో తెలిపిన మొత్తం పై అంగీకరించిన రేటు వంతుల తదుపరి వడ్డీ మరియు చెల్లింపు తేదీ వరకు అనుషంగిక ఖర్చులు, వ్యయం, ఛార్జీలు మొదలైన వాటితో పాటు నోటీసులలో తెలిపిన మొత్తాన్ని తిరిగి చెల్లించవలసినదిగా దిగువ తెలిపిన ఋణగ్రహీతలు / హామీదారులు / తనఖా పెట్టిన వ్యక్తులను కోరారు.

చివరిగా తెలిసిన వారి చిరునామాలకు జారీ చేసిన నోటీసులు అందజేయబడకుండా తిరిగి వచ్చినవి మరియు అందువలన దాని గురించి బహిరంగ ప్రకటన ద్వారా వారికి ఇందుమూలంగా తెలియజేయడమైనది.

సెక్యూర్డ్ ఆస్తులను విడిపించుకొనుటకు లభించే సమయానికి సంబంధించి చట్టంలోని సెక్షన్ 13లోని సబ్-సెక్షన్(8)లోని నిబంధనలను గమనించవలసిందిగా ఋణగ్రహీతలను కోరడమైనది.

ఋణగ్రహీత(లు)/సహ-ఋణగ్రహీత(లు)/హామీదారు(లు) పేర్లు	NPA తేది / ఋణ మొత్తం	డిమాండ్ నోటీసు తేది / బకాయి మొత్తం
లోన్ ఖాతా నెం. RAZOLTF1904170002 1. **బొంతు రాజేశ్వరరావు, తండ్రి: ప్రభాకరరావు,** శ్రీ లక్ష్మీ సాయి ఇండస్ట్రీస్, హెచ్.నెం.80, బుంటిసీ SLN స్ప్రింగ్స్, బొటానికల్ గార్డెన్ ప్రక్కన, గచ్చిబౌలి-500032, కెవి రంగారెడ్డి, హైదరాబాద్, తెలంగాణ రాష్ట్రం. ప్రస్తుత నివాసం: డి.నెం.116-3-378/F, అభయ పొన్నారి నగర్, శ్రీ కోదండ రామాలయం సెంటర్, గాదాల-533102, రాజమండ్రి రూరల్, తూర్పు గోదావరి జిల్లా. 2. **బొంతు అరుణ కుమారి, భర్త: రాజేశ్వరరావు,** డి.నెం.8-2-603/బి/4/బి1, బంజారా స్ప్రింగ్స్ అపార్ట్‌మెంట్స్, రోడ్డు నెం.10, జహ్రా నగర్ X రోడ్డు, ఖైరతాబాద్, బంజారాహిల్స్, హైదరాబాద్-500034, తెలంగాణ రాష్ట్రం. ప్రస్తుత నివాసం: డి.నెం.116-3-378/F, అభయ పొన్నారి నగర్, శ్రీ కోదండ రామాలయం సెంటర్, గాదాల-533102, రాజమండ్రి రూరల్, తూర్పు గోదావరి జిల్లా.	08.12.2023 రూ. 3,00,00,000/-	28.02.2025 తేది.28.02.2025 నాటికి రూ. 2,48,57,891/- (అక్షరాల రెండు కోట్ల నలభై ఎనిమిది లక్షల యాభై ఏడు వేల ఎనిమిది వందల తొంభై ఒక్క రూపాయలు మాత్రమే)
3. **బొంతు సాయివెంకట్, తండ్రి: రాజేశ్వరరావు,** హెచ్.నెం.80, బుంటిసీ SLN స్ప్రింగ్స్, బొటానికల్ గార్డెన్ ప్రక్కన, గచ్చిబౌలి-500032, శేరిలింగంపల్లి, కెవి రంగారెడ్డి, హైదరాబాద్, తెలంగాణ రాష్ట్రం.		
4. **బొంతు ఉదయ భాస్కర్ రావు, తండ్రి: ప్రభాకర్‌రావు,** డి.నెం.8-110, మైత్రీపురం, జిల్లెలగూడ, సరూర్ నగర్, రంగారెడ్డి-500097, హైదరాబాద్, తెలంగాణ రాష్ట్రం.		
5. **బొలిశెట్టి నాగేశ్వరరావు, తండ్రి: రామమోహన్‌రావు,** డి.నెం.4-131, అప్పనరామునిలంక, పంచాయతీ రోడ్డు దగ్గర, అప్పనరామునిలంక, సఖినేటిపల్లి, అంతర్వేదిపాలెం- 533252, డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా.		

స్థిరాస్తి షెడ్యూల్: RAZOLTF1904170002 స్థిరాస్తి షెడ్యూల్ వివరణ:

ఐటమ్ నెం.1: తూర్పు గోదావరి జిల్లా, మలికిపురం సబ్-జిల్లా, మలికిపురం మండలం, మలికిపురం గ్రామపంచాయతీ మరియు గ్రామ ఖాతాలు, జిరాయితీ డ్రై ల్యాండ్, ఆర్.యస్.నెం.13/4 మొత్తం విస్తీర్ణం ఎ॥ 0.50 సెంట్లలో పడమర దిశలో ఎ॥ 0.25 సెంట్లు లేదా 1210 చ॥గ॥ల ఖాళీస్థలమునకు **హద్దులు: తూర్పు:** రేపాక ఇజ్రాయిల్‌కు చెందిన స్థలము; **దక్షిణం:** ఆర్.యస్.నెం.14/4 లోని స్థలము; **పడమర:** రోడ్డు; **ఉత్తరం:** LEF చర్చి, కొల్లాబత్తుల డేవిడ్ రాజు మరియు కొల్లాబత్తుల జీవన్ రాజుకి చెందిన స్థలము.

ఐటమ్ నెం.2: తూర్పు గోదావరి జిల్లా, మలికిపురం సబ్-జిల్లా, మలికిపురం మండలం, మలికిపురం గ్రామపంచాయతీ మరియు గ్రామ ఖాతాలు, జిరాయితీ డ్రై ల్యాండ్, ఆర్.యస్.నెం.14/4 మొత్తం విస్తీర్ణం ఎ॥ 0.81 సెంట్లలో ఎ॥ 0.56 సెంట్లు లేదా 2710.4 చ॥గ॥ల ఖాళీస్థలమునకు **హద్దులు: తూర్పు:** రేపాక ఇజ్రాయిల్‌కు చెందిన స్థలము; **దక్షిణం:** ఇరిగేషన్ చానెల్; **పడమర:** రోడ్డు; **ఉత్తరం:** ఆర్.యస్.నెం.14/4 లోని స్థలము. **ఐటమ్ నెం.1 & 2 కలిపి మొత్తం 3920.4 చ॥గ॥ అన్ని అనుషంగిక హక్కులతో సహా.**

పైన పేర్కొన్న పరిస్థితులలో ఈ నోటీసు ప్రచురించబడిన తేదీ నుండి 60 రోజులలోగా భవిష్యత్తు వడ్డీ మరియు వర్తించు ఛార్జీలతో పాటు పైన పేర్కొన్న విధంగా చెల్లించవలసిన మిగులు బకాయి మొత్తాలను చెల్లించవలసిందిగా పైన తెలిపిన ఋణగ్రహీతలు / సహ-ఋణగ్రహీతలు మరియు / లేదా వారి హామీదార్లు (వర్తించునప్పుడు) కు ఇందుమూలంగా నోటీసు ఇవ్వబడమైనది. ఆ విధంగా చేయుటలో విఫలమైతే ఈ నోటీసు తేదీ నుండి 60 రోజులు ముగిసిన తరువాత సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002 లోని సెక్షన్ 13(4) మరియు దాని క్రింద వర్తించే రూల్స్ క్రింద ఋణగ్రహీతలు మరియు తనఖా పెట్టిన వ్యక్తుల సెక్యూర్డ్ ఆస్తుల స్వాధీనం చేసుకొనుటతో సహా సెక్యూర్డ్ ఆస్తుల పైన తదుపరి చర్యలు చేపట్టబడును. సదరు చట్టంలోని సెక్షన్ 13(13) క్రింద ఏ ఋణగ్రహీత సెక్యూర్డ్ క్రెడిటార్ యొక్క ముందస్తు వ్రాతపూర్వక సమ్మతి లేకుండా పొందకుండా నోటీసులో రిఫర్ చేసిన అతని సెక్యూర్డ్ ఆస్తులు వేటిని అమ్మకం, లీజు లేదా ఇతరత్రా బదిలీ చేయరాదని గమనించవలెను.

ప్రదేశం: కాకినాడ — సం/- అధీకృత అధికారి, శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
బి. కిరణ్‌కుమార్
9912220386